# జనరల్ స్టడీస్

## ఇండియన్ ఎకానమీ

**ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు సంబంధించిన అంచనాలనే బడ్జెట్ అంటారు. బడ్జెట్ అనే పదం 'బొగెట్టె' అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. రాజ్యాంగంలోని 112వ అధికరణలో బడ్జెట్ అనే పదానికి బదులు "వార్షిక ఆర్థిక ప్రకటన" (Annual Financial Statement) అనే పదాన్ని వాడారు.**

### బడ్జెట్ – భావనలు

మన దేశంలో ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుంది. స్వాతంత్ర్యం వచ్చాక తొలి బడ్జెట్‌ను రూ. 197.39 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ. 171 కోట్ల రెవెన్యూ అంచనాతో 1947 నవంబరు 26న ఆర్.కె.షణ్ముగం శెట్టి ప్రవేశపెట్టారు. గణతంత్ర దేశంలో మొదటి బడ్జెట్‌ను జాన్ మతాయ్ 1950 ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి ప్రధానిగా నెహ్రూ, మొదటి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ నిలిచారు. 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత మొరార్జీ దేశాయ్‌కు దక్కుతుంది. ఆ తర్వాతి స్థానంలో చిదంబరం ఉన్నారు. ఈయన 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు.

★ బడ్జెట్‌లో ప్రధానంగా సంఘటిత, అగంతుక ప్రభుత్వ ఖాతాలు ఉంటాయి. సంఘటిత నిధిలో వసూలైన రుణాలు, రాబడులు ఉంటాయి. సాధారణ బడ్జెట్‌గా పిలిచే దీని నుంచి వ్యయం చేయాలంటే ప్రభుత్వం పార్లమెంట్ అనుమతి తీసుకోవాలి.

### బడ్జెట్ – భాగాలు

బడ్జెట్‌లో రాబడులు, వ్యయాలు ఉంటాయి.

రాబడులు:

- రాబడుల్లో రెవెన్యూ, మూలధన రాబడులు ఉంటాయి.
- రెవెన్యూ రాబడిలో పన్నులు, పన్నేతర రాబడులు ఉంటాయి.
- పన్నుల్లో వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేషన్ పన్ను, సంపద, బహుమతి పన్నులను ప్రత్యక్ష పన్నులు అంటారు.
- ఎక్సైజ్, కస్టమ్స్, సేవా పన్నులు పరోక్ష పన్నులు.
- పన్నేతర రాబడిలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వసూలైన వడ్డీలు, వాణిజ్య పాలనా రాబడులు, ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు, ఫీజులు, పెనాల్టీలు, డివిడెండ్లు మొదలైనవి ఉంటాయి.
- మూలధన రాబడిలో స్వదేశీ, విదేశీ రుణాల వసూలు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, పెట్టుబడుల ఉపసంహరణ, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వసూలైన రుణాలు ఉంటాయి.

వ్యయాలు:

- వ్యయాల్లో ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం ఉంటాయి.
- ప్రణాళిక వ్యయంలో రెవెన్యూ, మూలధన వ్యయం ఉంటాయి.
- రెవెన్యూ వ్యయంలో కేంద్ర ప్రణాళిక వ్యయం, కేంద్రం రాష్ట్రాలకు చేసే ప్రణాళిక సహాయం ఉంటాయి.
- మూలధన వ్యయంలో కూడా ఈ అంశాలే ఉంటాయి.
- ప్రణాళికేతర వ్యయంలో తిరిగి రెవెన్యూ, మూలధన ప్రణాళికేతర వ్యయం ఉంటాయి.
- రెవెన్యూ ప్రణాళికేతర వ్యయంలో వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, రక్షణ (శాంతి సమయంలో), గ్రాంట్లు, పెన్షన్లు ఉంటాయి.
- మూలధన ప్రణాళికేతర వ్యయంలో యుద్ధ సమయంలో రక్షణ వ్యయం, దేశంలోని సంస్థలకు, రాష్ట్రాలకు, విదేశాలకు ఇచ్చే రుణాలు ఉంటాయి.

★ బడ్జెట్‌లో మొత్తం రాబడి, మొత్తం వ్యయాలు సమానంగా ఉంటే అది సంతులిత బడ్జెట్. వ్యయం ఎక్కువగా ఉంటే (రాబడి కంటే) లోటు బడ్జెట్ అని, వ్యయం తక్కువగా ఉంటే మిగులు బడ్జెట్ అని అంటారు.

★ బడ్జెట్‌ను రెవెన్యూ బడ్జెట్, మూలధన బడ్జెట్ అని రెండు రకాలుగా పేర్కొంటారు.

1. రెవెన్యూ బడ్జెట్ – దీనిలో రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయాలు ఉంటాయి.
2. మూలధన బడ్జెట్ – దీనిలో మూలధన రాబడి, మూలధన వ్యయాలు ఉంటాయి.

★ రెవెన్యూ మూలధన రాబడుల మొత్తం → మొత్తం రాబడులు

★ రెవెన్యూ మూలధన వ్యయాల మొత్తం → మొత్తం వ్యయాలు

★ రెవెన్యూ రాబడిలో పన్ను, పన్నేతర రాబడులుంటాయి.

**పన్ను రాబడిలో**

1) ప్రత్యక్ష పన్నులు – కార్పొరేషన్, ఆదాయం, సంపద, బహుమతి పన్నులు

2) పరోక్ష పన్నులు – ఎక్సైజ్, కస్టమ్స్, సేవాపన్నులు

**పన్నేతర రాబడిలో**

1) ప్రభుత్వ రాబడులు

2) ప్రభుత్వ రంగ సంస్థల రాబడులు

3) లాభాలు, డివిడెండ్లు

4) పరిపాలనా రాబడులు

**రెవెన్యూ వ్యయం రెండు రకాలు.**

→ ప్రణాళికా వ్యయం

→ ప్రణాళికేతర వ్యయం

**మూలధన రాబడులు**

1. రుణాలు → చిన్న పొదుపులు, ప్రభుత్వ సెక్యూరిటీలు, అమ్మకాలు, విదేశీ సంస్థల నుంచి రాబడులు

2. రుణేతర రాబడులు → రుణాల వసూళ్లు, ఆస్తుల అమ్మకాలు, పెట్టుబడులు ఉపసంహరించిన నిధులు

**మూలధన వ్యయాలు**

ఎ) ఆర్థికాభివృద్ధి కోసం కేటాయించిన వ్యయాలు

బి) సామాజిక, ఆర్థిక, రక్షణ వ్యయాలు

సి) సాధారణ సేవలు

డి) ప్రభుత్వ రంగ సంస్థలకు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు, విదేశాలకు ఇచ్చే రుణాలు.

## బడ్జెట్ రకాలు

1. **సాధారణ బడ్జెట్ / సంప్రదాయ బడ్జెట్:** కిందటి సంవత్సరం కేటాయింపుల ఆధారంగా ప్రస్తుత సంవత్సరం కేటాయింపులు జరిపే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్ అంటారు.

2. **శూన్యాధార బడ్జెట్ (Zero Based Budget):** ఈ బడ్జెట్‌ను అమెరికాలోని సంస్థలో పీటర్ పైర్ ప్రారంభించాడు.
   - ★ దీని ప్రకారం గత సంవత్సర బడ్జెట్ అంశాలతో సంబంధం లేకుండా ప్రతి సంవత్సరం కొత్తగా ఆ సంవత్సరం అవసరాల ప్రకారం తయారుచేసే బడ్జెట్.
   - ★ భారత్‌లో 1986 – 87లో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా అది కొనసాగలేదు.

3. **సామర్థ్య ఆధారిత బడ్జెట్ (Performance Based Budget):** ఈ బడ్జెట్‌ను అమెరికాలో 1948లో ప్రవేశపెట్టారు.
   - ★ హోవర్ కమిషన్ దీన్ని సిఫారసు చేసింది.
   - ★ శాఖల పనితీరు, సామర్థ్యం, పథకాల ఆధారంగా కేటాయింపులు జరిపి, వ్యయం చేసేదాన్ని సామర్థ్యాధారిత బడ్జెట్ అంటారు.
   - ★ పరిపాలన సంస్కరణల సంఘం సిఫారసుల మేరకు భారత్‌లో 1968లో కొన్ని శాఖల్లో దీన్ని ప్రవేశపెట్టారు.

## బడ్జెట్ – లోటులు

★ సాధారణంగా బడ్జెట్‌లో ఆదాయాలు, వ్యయాలు ఉంటాయి.

★ ఆదాయాలు, వ్యయాలు సమానంగా ఉంటే దాన్ని సంతులిత బడ్జెట్ అంటారు.

★ ఆదాయాలు వ్యయాల కంటే తక్కువగా ఉంటే దాన్ని లోటు బడ్జెట్ అంటారు.

★ బడ్జెట్ లోటులు 5 రకాలు

1. రెవెన్యూ లోటు (Revenue Deficit)
2. బడ్జెట్ లోటు (Budget Deficit)
3. కోశ లోటు (Fiscal Deficit)
4. ప్రాథమిక లోటు (Primary Deficit)
5. ద్రవ్య లోటు (Monetary Deficit)

**1. రెవెన్యూ లోటు (1950 – 51 నుంచి గణన):** రెవెన్యూ రాబడి కంటే రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉంటే అది రెవెన్యూ లోటు.

★ రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం – రెవెన్యూ రాబడి

★ రెవెన్యూ లోటు = (ప్రణాళిక + ప్రణాళికేతర వ్యయం) – (పన్ను రాబడి + పన్నేతర రాబడి)

**2. బడ్జెట్ లోటు (1950 – 51 నుంచి):** మొత్తం రాబడి కంటే మొత్తం వ్యయం ఎక్కువగా ఉంటే బడ్జెట్ లోటు అంటారు.

★ బడ్జెట్ లోటు = మొత్తం వ్యయం – మొత్తం రాబడులు

★ బడ్జెట్ లోటు = (రెవెన్యూ వ్యయం + మూలధన వ్యయం) – (రెవెన్యూ రాబడులు + మూలధన రాబడులు)

**3. కోశ లోటు (1997 – 98 నుంచి):** సుఖమయ్ చక్రవర్తి కమిటీ సిఫారసుల ఆధారంగా.

★ బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలను కలిపితే కోశలోటు వస్తుంది.

★ కోశలోటును 1997 – 98 నుంచి లెక్కిస్తున్నారు.

★ మూలధన రాబడులు, మార్కెట్ రుణాల మధ్య ఉన్న తేడానే కోశ లోటు అంటారు.

★ దీన్ని రుణాలు, కరెన్సీ ముద్రణ ద్వారా భర్తీ చేస్తారు.

★ భారత ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చే లోటు కొలమానం: కోశలోటు.

★ కోశలోటు = బడ్జెట్ లోటు + మార్కెట్ రుణాలు

★ దీన్ని మొత్తం వ్యయం నుంచి రెవెన్యూ రుణేతర రాబడులను తీసివేసి పొందొచ్చు లేదా మొత్తం వ్యయం నుంచి రుణాలు మినహా మొత్తం రాబడులను తీసేస్తే కోశలోటు వస్తుంది.

**4. ప్రాథమిక లోటు:** కోశలోటు, వడ్డీ చెల్లింపులకు మధ్య ఉన్న తేడానే ప్రాథమిక లోటు అంటారు.

★ ప్రాథమిక లోటు = కోశ లోటు – వడ్డీ చెల్లింపులు

**5. ద్రవ్య లోటు:** ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన లోటును నూతన కరెన్సీ ముద్రణ ద్వారా భర్తీ చేస్తే దాన్ని ద్రవ్య లోటు అంటారు.

★ ద్రవ్యలోటు భర్తీ వ్యవస్థలో ద్రవ్య సప్లయిని పెంచుతుంది. ఇది ధరల పెరుగుదలకు దారి తీస్తుంది.

**వాస్తవ రెవెన్యూ లోటు:** రెవెన్యూ లోటు నుంచి మూలధన ఆస్తులు సృష్టించే గ్రాంట్లను తీసివేస్తే వచ్చేది వాస్తవ రెవెన్యూ లోటు.

**రచయిత: దాసరి రాజేందర్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net